క్లుప్తంగా

రోడ్డు పనులకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య పడాల్

చింతపల్లి: మండంలోని తాజంగి పంచాయతీ పరిధిలోని బీటా లైన్‌లో జెడ్పీ నిధులు రూ.15లక్షలతో సీసీ రోడ్డు, బూడితపాడులో రూ.10లక్షలతో జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగు నీటి పథకం నిర్మాణ పనులకు ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య పడాల్ తదితరులు గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలో శివారు గ్రామాలకు రోడ్లు, తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. సర్పంచ్ వంతల మహేశ్వరి, వైస్ సర్పంచ్ గెమ్మిలి రవి, కార్యదర్శి శ్రీధర్, మాజీ ఎంపీటీసీ కోరాబు అంగదరావు, వార్డు సభ్యుడు సదాశివ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



పూడిక పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతామహాలక్ష్మి

చింతపల్లి: మండల కేంద్రంలోని అంతర్ల కాలనీలో ఎంపీడీవో సీతామహాలక్ష్మి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఇళ్ల పరిసరాలు, కాలువల్లో చెత్త వేయవద్దని సూచించారు. మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. డ్రైనేజీ పూడిక పనులను ఆమె పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్, సీనియర్ అసిస్టెంట్ అంబేడ్కర్ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతికి సంతాపం



వెంకటేశ్వర్లు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

ఎటపాక: మండలంలోని గుండాల పంచాయతీ మాజీ ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఏసుపాక వెంకటేశ్వర్లు బుధవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. మండలంలోని పార్టీ బలోపేతానికి వెంకటేశ్వర్లు విశేష సేవలందించారని పలువురు చెప్పారు. వెంకటేశ్వర్లు పార్థీవ దేహానికి జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత, ఎంపీటీసీ సభ్యుడు గొంగడి వెంకట్రామిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి కురినాల వెంకట్, ఉప సర్పంచ్ తోట శశికుమార్, ప్రధాన కార్యదర్శి నర్సింహారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రాజారావు సేవలు మరువలేనివి

రంపచోడవరం: సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో చాగంటి రాజారావు వర్ధంతి సభ దేవీపట్నం మండలం తున్నూరులో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సీపీఐ(ఎం.ఎల్) రాజారావు గిరిజనుల పక్షాన నిలబడి భూ పోరాటాలు చేశారన్నారు. నాయకులు రాఘవులు, బొజ్జిరెడ్డి, శ్రీదేవి, పాపన్న తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ సంస్కృతిని కాపాడుకోవాలి

డుంబ్రిగుడ: మండలంలోని గుంటసీమ, నందివలస ప్రాంతాల్లోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలపై సీపీఎఫ్ సేవా సంస్థ ప్రతినిధి శాంతారావు అవగాహన కల్పించారు. ఆదివాసీ జీవన విధానం, పంటలు, పండగలు, శంకు దేవత పూజలు తదితర అంశాలు కనుమరుగైపోతున్నాయని, వాటిని పరిరక్షించుకోవాలని ఆయన చెప్పారు. అడవుల రక్షణ, సంప్రదాయ పంటల సాగు, ఆదివాసీ సంస్కృతిని కాపాడుకోవాలని సూచించారు. ఈ మేరకు ఆయా అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ప్రిన్సిపాల్ భవాని, సీపీఎఫ్ పాడేరు ప్రోగ్రాం అధికారి ఆచార్య నాగమణి, ప్రతినిధులు కమల, మాలతి, లక్ష్మి పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

రాజవొమ్మంగి: మండలకేంద్రం రాజవొమ్మంగిలోని షిరిడీసాయి బాబా మందిరంలో వద్ద గురువారం భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. అన్నదాన కార్యక్రమం కోసం నరేష్, నాగలక్ష్మి దంపతులు విరాళం సమకూర్చారు. సాయి బాబా దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. అనంతరం భజన కీర్తనలు ఆలపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శిమిలిగుడలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం



లంతంపాడు గ్రామంలో పాఠశాల దుస్థితి

నిర్లక్ష్యానికి నిదర్శనం

- శిథిలావస్థ భవనాల్లో పాఠశాలలు
- సొంతగూడు కరువు
- పెచ్చులూడుతున్న శ్లాబ్‌లు
- వర్షం పడితే గదులన్నీ జలమయం
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు
- పట్టించుకోని అధికారులు



బొండాగుడలో షెడ్డులో కొనసాగుతున్న పాఠశాల



శిథిల భవనంలో పాడైన గచ్చుపై కూర్చొని పాఠాలు వింటున్న విద్యార్థులు

అరకులోయటౌన్: కూటమి ప్రభుత్వం ఏజెన్సీలో విద్యాభివృద్ధిపై కనీసం దృష్టి సారించడం లేదు. మండలంలోని దెబ్బతిన్న పాఠశాలల్లో ఒక భవనానికి కూడా కూటమి ప్రభుత్వం మరమ్మతు చేయలేదు. నిధులు మంజూరైనా ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉన్న పాఠశాలల భవనాలు పూర్తి చేయలేదు. శిథిల భవనాల్లోనే కనీస సౌకర్యాలు లేని పాఠశాలల్లో గిరిజన విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. కూటమి పాలకుల నిర్లక్ష్యం గిరిజన విద్యార్థుల పాలిట శాపంగా మారింది.

'నాడు–నేడు'తో సర్కారు బడులకు మహర్దశ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు ద్వారా ఏజెన్సీలో సర్కారు పాఠశాలలకు మహర్దశ కల్పించింది. ఏ ప్రభుత్వం చేయని విధంగా నాడు జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సర్కారు బడుల రూపురేఖలు మార్చింది. శిథిల భవనాలను తొలగించి కొత్త భవనాల నిర్మాణంతో పాటు అన్ని పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాలను కల్పించింది. ఏజెన్సీలో విద్యాభివృద్ధికి నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలను వెచ్చించారు. నాటి వైఎస్సార్‌సీపీ పాలనలో మన్యంలో సర్కారు బడులు ఎవరూ ఊహించని విధంగా అభివృద్ధి చెందాయి.

అన్ని పాఠశాలలను బాగు చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైనా కాంట్రాక్టర్లు పనులు చేయకుండా వదిలేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులకు ఆటంకం కలిగింది. ఇంకా కొన్ని ప్రాంతాల్లో పాఠశాలల భవనాల పనులు ప్రారంభానికి ఎన్నికల కోడ్ ఆటంకం వచ్చింది. ఫలితంగా పనులు నిలిచిపోయాయి.

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం

అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఏజెన్సీలో నేటి వరకు ఒక్క పాఠశాల భవనానికి మరమ్మతు పనులు గాని, కొత్త భవన నిర్మాణ పనులు గాని చేపట్టలేదు. గత పదేళ్ల క్రితం పాఠశాల భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే పాఠశాల హెచ్‌ఎంలు కాంట్రాక్టర్‌లు ఆయా నిధులను డ్రా చేసుకొని దుర్వినియోగం చేసి, పాఠశాల భవనాలను అర్ధంతరంగా పనులు నిలిపివేశారు.

పాకలు, షెడ్డులలోనే సర్కారు బడులు కొనసాగుతున్నాయి. కొన్నిచోట్ల పరాయిపంచన తరగతులు నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం పాఠశాలల దుస్థితిపై కనీసం దృష్టి సారించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలకు భవనాలు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

మండలం: అరకులోయ

సొంత భవనాలు లేని పాఠశాలలు

గ్రామం	విద్యార్థుల సంఖ్య
వర్రాటోకవలస	11
దోమలజోరి	11
పూజరిగుడ	28
తుంగగెడ్డ	20
బొరిబెడ్డ	09
లింబగుడ	14
బొండగుడ	26
శిథిల భవనాల్లో సాగుతున్న బడులు	
మాలిశింగారం	46
గాతపాడు	21
లంతంపాడు	46
ఇరుగాయి	15
భీముడువలస	25
బొండాం	34
వల్లివలస	27
పెదగంగగుడి	15
రంపుడువలస	19

భవనాన్ని నిర్మించాలి



గ్రామంలోని పాఠశాల భవన నిర్మాణానికి సుమారు 12 సంవత్సరాల క్రితం నిధులు మంజూరైతే కాంట్రాక్టర్ పునాదులు వేసి, పనులు చేయకుండా విడిచిపెట్టారు. దీంతో గ్రామంలోని విద్యార్థులు వర్షానికి తడిసి, ఎండకు ఎండి /తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి పాఠశాల భవనం నిర్మాణాన్ని పూర్తి చేయాలి. – కిల్లో లచ్చిందర్, బొండాగుడ గ్రామం, బస్కీ పంచాయతీ, అరకులోయ

నిత్యం భయం భయం



గ్రామంలోని రేకుల షెడ్డు పాఠశాల భవనం పూర్తిగా శిథిలమైంది. కిటికీలు, తలుపులు పడిపోయే స్థితిలో ఉన్నాయి. ఎప్పుడు కూలిపోతోందోనన్న భయం వెంటాడుతోంది. ప్రస్తుతం పాఠశాలలో 46 మంది చిన్నారులున్నారు. వారికి ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళన కలుగుతుంది. భవన నిర్మాణానికి నిధులు మంజూరైతే అర్ధంతరంగా నిర్మాణం నిలిపివేశారు. అధికారులు స్పందించి భవనం నిర్మించాలి. – గెమ్మెలి సన్యాసిరావు, లంతంపాడు గ్రామం, శిరగాం పంచాయతీ, అరకులోయ

ప్రతిపాదనలు పంపాం



శిథిల భవనాలు జాబితా, భవనాలు లేని పాఠశాలలకు నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వం మంజూరు చేసి, నిధులు విడుదల చేస్తే కొత్త భవనాలు నిర్మిస్తాం. అర్ధంతరంగా నిలిపివేసిన భవనాల వివరాలు, కాంట్రాక్టర్ల వివరాలు సైతం జిల్లా విద్యాశాఖకు సమర్పించాం. – వంతాల త్రినాథరావు, ఎంఈవో, అరకులోయ

బిక్కుబిక్కుమంటూ..

అరకులోయ మండలంలో భవనాలు లేని పాఠశాలలు, శిథిలావస్థకు చేరిన పాఠశాలలతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. సుమారు ఆరు నుంచి ఏడు గ్రామాలకు పైగా పాఠశాలలకు సొంత గూడు లేదు.వీటిలో అన్ని పాఠశాల భవనాలు శిథిలదశలో ఉన్నాయి. పరాయి పంచన, పాకల్లో తరగతులు కొనసాగుతున్నాయి. అధ్వాన భవనాల్లో విద్యార్థులు నానా యాతన పడి చదువుకుంటున్నారు. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాల్లో... ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పాలకులు, విద్యాశాఖాధికారులు స్పందించి పాఠశాల భవనాలు లేని చోట నూతనంగా భవనాలు నిర్మించాలని, శిథిలావస్థకు చేరిన వాటిలో ప్రత్యామ్నాయంగా కొత్త భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

మోసపూరిత హామీలతో చంద్రబాబు పాలన



సంగడ గ్రామంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



లింగేటిలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న మండల పార్టీ అధ్యక్షులు చంద్రబాబు,పార్టీ నాయకులు

- నాలుగు పంచాయతీల్లో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ'
- జోరు వానలో కొనసాగిన కార్యక్రమానికి విశేష స్పందన

ముంచంగిపుట్టు: అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి మోసాలతో చంద్రబాబు పాలన చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు అన్నారు. మండలంలోని వనుగుమ్మ, దొడిపుట్టు, బుంగాపుట్టు, బరడ, సుజనకోట పంచాయతీల్లో గురువారం వైఎస్సార్‌సీపీ నేతలు బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, అమలు చేయకపోవడంపై ప్రజలకు వివరించారు. క్యూఆర్ కోడ్ ఫోన్‌లో స్కానింగ్ చేయించి, జగనన్న సంక్షేమ పాలన, కూటమి అసమర్థత పాలనై తెలియజేశారు.ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు మాట్లాడుతూ సంక్షేమ పాలన అందించడంతో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఉచిత బస్సు, మూడు సిలిండర్ల గ్యాస్, అన్నదాత సుఖీభవ, ఒక్కో మహిళకు రూ.1500 అంటూ పథకాలతో మభ్యపెట్టిన కూటమి నేతలు ఇప్పుడు ఏ మొఖం పెట్టుకుని గ్రామాల్లోకి వస్తారన్నారు. వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచులు, ఎంపీటీసీలు మిల్కి, వసంత, పార్వతి, నోబిన, రమేష్, సుబ్బలక్ష్మీ, నోబ్సో, నాయకులు మూర్తి, జయదేవ్, సన్యాసిరావు, తిరుపతిరావు, నీలకంఠం, దేవా, సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం అరాచక పాలన

పెదబయలు: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి అరాచక పాలన సాగిస్తుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మజ్జి చంద్రబాబు అన్నారు. మండలంలోని లింగేటి, బొంగరం పంచాయతీ కేంద్రాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం జోరు వానలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, ప్రజలకు ఇబ్బందులు పెట్టే పనులు మాత్రమే చేస్తుందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో చేపట్టిన ఇంటింటికీ రేషన్ పద్ధతిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత డిపోల ద్వారా రేషన్ పంపిణీ చేపడుతుందన్నారు.దీంతో సుదూరంలో ఉన్న డీపోలకు వెళ్లి గిరిజనులు సరకులు పొందాల్సిన దుస్థితి నెలకొందన్నారు. చంద్రబాబు చేస్తున్న మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని నాయకులను కోరారు. లింగేటి పంచాయతీ సర్పంచ్ అప్పలనాయుడు మాజీ ఎంపీటీసీ రాంబాబు, నాయకులు లక్ష్మీనాయుడు, చంటిబాబు, మోహన్‌రావు, కృష్ణారావు, ప్రకాశ్‌రావు, వార్డు సభ్యులు సన్యాసిరావు, గణేష్, లింగన్న, బొంగరం పంచాయతీ నాయకులు ప్రసాద్‌నాయుడు, నాగంనాయుడు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలను అరికట్టాలి

- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులోయటౌన్: అరకు నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, ఎటువంటి కబ్జాలు జరగకుండా తహసీల్దార్‌లందరూ కఠిన చర్యలు తీసుకోవాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల్లో ఇటీవల నూతన బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌లతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ భూ ఆక్రమణలను అరికట్టాలని ఆదేశించారు. గిరిజనేతరుల వల్లే భూకబ్జాలు జరుగుతున్నాయన్నాయని, వాటిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అరకులోయ, అనంతగిరి, పెదబయలు, ముంచంగిపుట్టు తహసీల్దార్‌లు వెంకట అప్పారావు, వీరభద్రచారి, త్రినాథరావు నాయుడు, శంకర్‌రావు, డీటీ తహసీల్దార్ గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడిన వారికి ప్రత్యేక గుర్తింపు



బస్కిలో ఎన్నిక పత్రాన్ని అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల పార్టీ నాయకులు



మాదల పంచాయతీ కేంద్రంలో సమావేశమైన వైఎస్సార్‌సీపీ నాయకులు



బరడలో ఎన్నికైన కమిటీకి పత్రాలు అందజేస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు పద్మారావు, నేతలు

అరకులోయటౌన్: వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసిన వారికి ఎప్పుడు మంచి గుర్తింపు లభిస్తుందని మండల పార్టీ అధ్యక్షుడు స్వాబి రామ్మూర్తి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు పల్టాసింగి విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, నియోజకవర్గం ఎస్టీ సెల్ కార్యదర్శి నర్సింహమూర్తి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పాడి రమేష్‌లు పిలుపునిచ్చారు. అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశాల మేరకు గురువారం బస్కీ, మాదల పంచాయతీ కేంద్రాల్లో పంచాయతీ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో మీరంతా కృషి చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు.

నూతన పంచాయతీ కమిటీ వివరాలు

బస్కీ పంచాయతీ కమిటీ అధ్యక్షుడిగా సమర్ధి బుజ్జిబాబు, ప్రధాన కార్యదర్శులుగా కిల్లో కృష్ణ, పాంగి జయరామ్, గెమ్మెలి కామేశ్వరరావు, వంతాల రామన్న, మాదల పంచాయతీ కమిటీ అధ్యక్షుడిగా కిల్లో సన్యాసి, ప్రధాన కార్యదర్శులుగా పడాల్టి తమ్మన్న, తామల చిన్నయ్య, కొర్రా గురుమూర్తి, గుమ్మడి ఎర్రన్న, కార్యదర్శులుగా ఆరుగురు, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ సర్పంచ్ కొర్రా సన్యాసి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవతోనే గుర్తింపు



చింతపల్లిలో ఏసీడీపీవో రామలక్ష్మిని సన్మానిస్తున్న ఐసీడీఎస్ పీడీ ఝాన్సీ రామ్, ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్యపడాల్

చింతపల్లి: ఉద్యోగ విరమణ పొందిన ఏసీడీపీవో ఎం.రామలక్ష్మికి స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు మాట్లాడుతూ నిస్వార్థ ప్రజా సేవలతోనే మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఏసీడీపీవో రామలక్ష్మి సేవలను వారు కొనియాడారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సన్మానించారు.ఐసీడీఎస్ పీడీ ఝాన్సీ రామ్, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, సీడీపీవో శ్రీదేవి, సర్పంచ్ దురియా పుష్పలత, సూపర్‌వైజర్లు జయభారతి, సౌజన్య, గౌరి, లక్ష్మి, తులసి, సీనియర్ అసిస్టెంట్ శర్మ పాల్గొన్నారు.



మోతుగూడెం పీఎస్‌లో పదవీ విరమణ పొందిన ఏఎస్‌ఐను సన్మానిస్తున్న ఏఎస్పీ

మోతుగూడెం: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన ఉద్యోగులకు ఎప్పటికి ప్రజల్లో తగిన గుర్తింపు ఉంటుందని చింతూరు ఏఎస్పీ అన్నారు. మోతుగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐ నూకరాజు పదవీ విరమణ కార్యక్రమంలో గురువారం ఏఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది ప్రజలతో మమేకమై విధుల నిర్వహించడం ద్వారా మంచి మన్ననలు పొందారని తెలిపారు. చింతూరు సీఐ గోపాల్‌కృష్ణ, డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్, మోతుగూడెం ఎస్‌ఐ సాదిక్, రమేష్ పాల్గొన్నారు.

6న మండల సమావేశం

జి.మాడుగుల: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 6న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో డేవిడ్‌రాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో గల జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు మండలస్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు. అధికారులు పూర్తి చేసిన పనుల వివరాలు తీసుకురావాలని సూచించారు.

ఆలయంలో టేబుళ్లు, కుర్చీల ఏర్పాటుకు విరాళం



విరాళం ఇస్తున్న దాతలు సుందరరావు సీతా మహాలక్ష్మి దంపతులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని షిర్డీ సాయి బాబా మందిరింలో టేబుళ్లు, కుర్చీల ఏర్పాటుకు నగదును తణుకు గ్రామానికి చెందిన భక్తులు వాడ్రేవు సుందరరావు, సీతామహాలక్ష్మి దంపతులు గురువారం వితరణ చేశారు. భక్తులు కూర్చొని భోజనాలు చేసే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ సభ్యులను వారు కోరారు.

పశువ్యాధులపై అప్రమత్తం



మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

జి.మాడుగుల: మండలంలో వంజరి పంచాయతీ వేర్లమామిడి గ్రామంలో గురువారం ఫ్రిడే పోజెక్టు(సీఎస్‌సీ)సంస్థ, ఎల్ఐసీ హెచ్‌ఎఫ్‌ఎల్ ప్రాజెక్టు మేనేజర్ కమల్నాథ్–సీఎస్‌ఏ సంస్థ, గిరిసిరి ఎఫ్‌పీసీఎల్ చైర్మన్ వి.రమేష్ ఆధ్వర్యంలో మెగా పశు వైద్య శిబిరం నిర్వహించారు. పాడి రైతులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పశువైద్యాధికారి డాక్టర్ ప్రియదర్శిని మాట్లాడుతూ మేకలు, కోళ్లకు వ్యాధులు సోకకుండా అందజేసే టీకాల గురించి వివరించారు. పశువ్యాధులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మేకల పెంపకం విధానాలు, కోళ్ల నిర్వహణ, వ్యాధుల నివారణ చిట్కాలు శుభ్రత, స్ప్రే అవసరం వంటి వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రీయ పద్ధతుల్లో పశు పాలన, సరైన ఆహారం, నివాస స్థల నిర్వహణపై రైతులకు విస్తృత అవగాహన ఆమె కల్పించారు. 20 గ్రామాల్లో ఒక వారం పాటు సీఆర్‌పీలు, వెటర్నరీ అసిస్టెంట్లు పశువుల పరిరక్షణ కార్యక్రమం కొనసాగిస్తారన్నారు. వంజరి సర్పంచ్ శివ నారాయణ, వెటర్నరీ సిబ్బంది వెంకటరమణ తదితరలు పాల్గొన్నారు.